క్లుప్తంగా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ



తాడేపల్లిలో వైఎస్ జగన్‌తో పలివెల సుధాకర్

కపిలేశ్వరపురం (మండపేట): తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మండపేట మండలం ఏడిద గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్ కలిశారు. జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలుతో కలిసి మంగళవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు మండపేట కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందన్నారు. కౌన్సిల్‌లో ఖాళీగా ఉన్న మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని కో ఆప్షన్ సభ్యుని ఎన్నుకునే ప్రక్రియ నిమిత్తం సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కో ఆప్షన్ స్థానానికి షేక్ ఇబ్రహీం నుంచి ఒక్క దరఖాస్తు అందిందని, దరఖాస్తుపై నిర్ణయం తీసుకునేందుకు కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చైర్‌పర్సన్ దుర్గారాణి తెలిపారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



నారాయణలంకలో పట్టుబడ్డ మట్టి లోడు లారీ

కపిలేశ్వరపురం: గ్రామ శివారు నారాయణలంకలోని లంక భూమిలో రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. లారీలో మట్టిని తరలిస్తుండగా మంగళవారం రెవెన్యూ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేదారిలంక, కపిలేశ్వరపురం-1 సచివాలయాల వీఆర్వోలు టి.వెంకటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, అంగర ఏఎస్ఐ ఆర్.సత్యనారాయణ మట్టి లోడు లారీని స్వాధీనపర్చుకొని అంగర పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చారు. తదుపరి చర్యలకు మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

హెచ్‌ఎంకు సత్కారం



హెచ్‌ఎం వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కె.గంగవరం: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ యంగ్ మైండ్స్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా సేవలందిస్తున్న వ్యక్తులకు అవార్డులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆదర్శ ఉపాధ్యాయులు అవార్డుకు కె.గంగవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. దీంతో ఆయన్ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 15 మంది విద్యార్థులను ట్రిపుల్ ఐటీకి ప్రవేశానికి కృషి చేసిన హెచ్‌ఎం సేవలను కొనియాడారు. ఈ నెల 20న కాకినాడలో జరిగే కార్యక్రమంలో వెంకటేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటారని వారు పేర్కొన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, వి.శ్రీధర్, ఏడుకొండలు, కె.శ్రీనివాసరావు, రామలక్ష్మి, పుష్పవల్లి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నైపుణ్య ఆధారిత ప్రగతి సాధించాలి



మాచర ఉన్నత పాఠశాలలో బహుమతులందుకున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: విద్యార్థులు నైపుణ్య ఆధారిత ప్రగతిని సాధించే దిశగా అడుగులు వేయాలని 10వ ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు ఉద్ఘాటించారు. మాచర పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జీవీవీ సత్యనారాయణ విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వీరబాబు, బాలు, రామారావు, పీఎంశ్రీ వృత్తి విద్యా శిక్షకులు లలిత, రాకేష్ పాల్గొన్నారు.

దమ్ము చక్రం.. రహదారులు ఛిద్రం

- కేజ్ వీల్స్ ట్రాక్టర్ల పయనంతో రోడ్లు గుల్ల
- ఇప్పటికే యజమానులను హెచ్చరించిన అధికారులు



ఇనుప బద్దె లేకుండా దమ్ము చక్రాలతో రహదారిపై వెళుతున్న ట్రాక్టర్



ఊకేజ్ వీల్స్ ట్రాక్టర్ల కారణంగా ఛిద్రమైన ఆర్అండ్‌బీ రహదారి

రాయవరం: ఏటా ఖరీఫ్, రబీ సమయాల్లో కేజ్ వీల్స్ (దమ్ము చక్రాలు)తో ట్రాక్టర్లు రహదారులను ఛిద్రం చేస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో కూడా వీల్స్ ట్రాక్టర్లు రహదారులపై యథేచ్ఛగా తిరుగాడుతూ రహదారులకు నష్టం చేకూరుస్తున్నాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన రహదారులు కొందరి నిర్లక్ష్యం కారణంగా శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. పంట చేలను దమ్ము చేయాల్సిన కేజ్ వీల్స్ ట్రాక్టర్లు రహదారులపై వెళుతూ ధ్వంసం చేస్తున్నాయి. రహదారులపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు జారీ చేస్తున్న హెచ్చరికలను ట్రాక్టరు యజమానులు ఎంతవరకు పాటిస్తారో చూడాల్సి ఉంది.

అన్ని రహదారులదీ అదే పరిస్థితి

క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలోని పలు గ్రామీణ రహదారులు కేజ్ వీల్స్ ట్రాక్టర్ల కారణంగా ఛిద్రమవుతున్నాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన ఇంటర్నల్ రోడ్లపై వీల్స్ ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో కొద్దిరోజులకే శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. పలు గ్రామీణ రహదారులపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో ఆ రహదారులు కొద్ది రోజులకే ఛిద్రమయ్యాయి. నియోజకవర్గంలోని ఇటీవల నూతనంగా నిర్మించిన పలు రహదారులు వీల్స్‌ట్రాక్టర్ల కారణంగా రోజురోజుకు మరింత అధ్వానంగా మారుతున్నాయి.

హెచ్చరికలు పాటిస్తారా

ప్రస్తుత ఖరీఫ్‌లో ట్రాక్టర్ యజమానులు తిరిగి దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రహదారులను ఛిద్రం చేస్తారని భావించిన అధికారులు ముందుగానే యజమానులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దారు, ఎంపీడీవో, పోలీసు, ఆర్అండ్‌బీ అధికారులు స్థానిక పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు యజమానులకు నిబంధనలు, సూచనలు వివరించారు. కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్లస్టర్ పరిధిలో సుమారు 800 పైగా ట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం.

సమస్యకు పరిష్కారం ఉన్నా

రహదారుల నిర్మాణంతో కష్టాలు తీరతాయని ప్రయాణికులు భావించినా కొద్ది రోజులకే రహదారులు నాశనమవుతున్నాయి. నాణ్యతాలోపాలకు తోడు కేజ్ వీల్స్ ట్రాక్టర్ల వీరవిహారం కొద్ది కాలానికే రహదారులు పూర్వస్థితికి చేరుకుంటున్నాయనే విమర్శలున్నాయి. కేజ్ వీల్స్ ట్రాక్టర్లు రహదారులపై ప్రయాణించే సమయంలో చక్రాలకు ఇనుప బద్దెను ఏర్పాటు చేసుకోవాలి. ఇనుప బద్దెను ఏర్పాటు చేయకపోవడంతో అవి ప్రయాణించే సమయంలో రహదారులను ధ్వంసం చేస్తున్నాయి. ఒక ఇనుప బద్దె ఏర్పాటుకు రూ.2వేల వరకు ఖర్చు అవుతుంది. ట్రాక్టర్ యజమానులకు అది స్వల్ప మొత్తమే అయినా పాటించడం లేదు. కొంతమంది పాటిస్తున్నా, అధిక సంఖ్యలో ట్రాక్టర్లు వీల్స్‌కు బద్దెలు అమర్చుకోవడం లేదు. ఖరీఫ్, రబీ వరినాట్ల సమయంలో రహదారులపై వీల్స్ ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రహదారులను నాశనం చేస్తున్న వీల్స్ ట్రాక్టర్లపై ఫిర్యాదు చేయాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడికి ఉన్నా మనకెందుకులే అనుకోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోంది.

వీఆర్వోలకు ఆదేశాలిచ్చాం

నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై తిరిగే కేజ్ వీల్స్ ట్రాక్టర్ల వివరాలు ఇవ్వాలని వీఆర్వోలకు ఆదేశాలిచ్చాం. దమ్ము చక్రాలకు ఇనుప బద్దెలు ఏర్పాటు చేసుకోకుండా తిరగడం వలన రహదారులు ఛిద్రమవుతున్నాయి. చక్రాలకు బద్దెలు అమర్చుకోకుండా రోడ్లపై తిరిగే కేజ్ వీల్స్ ట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఐపీ శెట్టి, తహసీల్దార్, రాయవరం

ఇనుప బద్దెలు ఏర్పాటు చేసుకోవాలి

రహదారిపై తిరిగే దమ్ము ట్రాక్టర్ల చక్రాలకు ఇనుప బద్దెలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై తిరిగే కేజ్ వీల్స్ ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. ప్రజలు సమాచారం ఇస్తే నిబంధనలకు విరుద్ధంగా తిరిగే ట్రాక్టర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– డి.సురేష్‌బాబు, ఎస్సై, రాయవరం

వర్మీ కంపోస్టు ఎరువు పంపిణీకి సిద్ధం



అంగరలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

కపిలేశ్వరపురం: అంగరలోని వర్మీ కంపోస్ట్ యార్డులో తయారైన ఎరువును రైతుకు కిలో పది రూపాయలకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శి ఆర్.మోహన్‌ను మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ వి.విజయలక్ష్మి ఆదేశించారు. గ్రామంలోని పారిశుద్ధ్య చర్యలను, ఎస్‌డబ్ల్యూపీసీల పనితీరును ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి డీఎల్‌డీఓ మంగళవారం పరిశీలించారు. తయారైన వర్మీ ఎరువును రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుడి ద్వారా రైతులకు కిలో పది రూపాయలకు విక్రయించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఐవీఆర్ కాల్స్ సర్వేలో గ్రామ వీధుల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించడంలో 95 శాతం ర్యాంకు దక్కడంపై ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి మోహన్, పారిశుధ్య కార్మికులను డీఎల్‌డీఓ అభినందించారు.

బీఎల్వోలకు నేడు శిక్షణ

కపిలేశ్వరపురం (మండపేట): జాతీయ, రాష్ట్రీయ ఎన్నికల కమిషనర్ల ఆదేశాలపై మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాల పోలింగ్ బూత్‌ల అధికారులకు బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్టు మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. మండలంలోని 45 మంది బీఎల్వోలకు మండపేట ఎంపీడీఓ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో, శిక్షణ ఇవ్వనున్నట్టు ఎన్నికల నమోదు అధికారి తెలిపారు.

ఆక్రమణలు తొలగించకుంటే క్రాప్ హాలిడే..



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఆక్రమణలపై వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ అరుణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో సుమారు 250 ఎకరాల పొలాలకు సాగు నీరందించే పంట కాలువ, అదే విధంగా మురుగు కాలువలు ఆక్రమణలకు గురవ్వడంపై ఆక్రమణలు తొలగించాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు మరోసారి విజ్ఞప్తి చేసినట్లు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్రమణదారులు ద్రాక్షారామ పరిధిలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలకు చెందిన ప్రభుత్వ ఆస్తులను, పంట కాలువలు, మురుగుకాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేశారన్నారు. వాటిని తమ వారసత్వ ఆస్తులుగా వాదన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యతగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు రైతులు ఏళ్ల తరబడి అనేకసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రైతుల సమస్యపై స్పందించి ఆక్రమణలకు తొలగింపుకు చర్యలు చేపట్టారని, గ్రామంలో ఆక్రమణల తొలగింపుకు మార్కింగ్ వేయడం మొదలు పెట్టారన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను, కలెక్టర్‌ను, ఆర్డీఓను కలసి ఆక్రమణల తొలగింపునకు విజ్ఞప్తి చేశారన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చూడకుండా ఆక్రమణలు శాశ్వతంగా తొలగిస్తారన్న నమ్మకం ఉందని, తగిన న్యాయం చేయకపోతే మాత్రం క్రాప్ హాలిడే ప్రకటించి నిరసన తెలిపేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని సర్పంచ్ తెలిపారు.

అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి

కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు

కె.గంగవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ విమర్శించారు. మండల కేంద్రమైన కె.గంగవరం బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకులు చేసిన మోసం అన్ని వర్గాల ప్రజలకు తెలిసిందని, ఆ పార్టీ నేతలో పాటు పొత్తులో ఉన్న జనసేన అధినేతకు మాత్రం ఇంకా అర్థం కాలేదన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడానికి అమలు చేయలేని వాగ్దానాలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచాక హామీలను నెరవేర్చకుండా కక్షసాధింపు చర్యలకు దిగడం దారుణమన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తుందని ఆ కార్యక్రమాన్ని గ్రామాల్లోని ప్రజలు తిప్పికొడుతున్నారన్నారు. తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లాల్సిన నాయకులు కేవలం కార్యకర్తల ఇంటికి మాత్రమే పరిమితం అవుతున్నారని తెలిపారు.

ప్రజలకు తెలియజేయాలి

చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఇంటింటికీ తెలియజేయడానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. 45 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాన్ని ఎత్తి చూపి ప్రజలకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, బీసీ నాయకుడు పంపన సుబ్బారావు, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, పంపన సత్యానందం, ఎస్సీ నాయకులు బత్తుల అప్పారావు, కాపు నాయకుడు, మాజీ సర్పంచ్ అడపా నారాయణ స్వామి, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు పృథ్వీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అవగాహనతో మలేరియా అదుపు



సత్యనారాయణపురంలో ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి

కపిలేశ్వరపురం: ఆరోగ్య అంశాలపై అవగాహనను పెంచుకోవడం ద్వారా మలేరియా వ్యాధిని అదుపు చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామ శివారు సత్యనారాయణపురంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మలేరియా వ్యాధి లక్షణాలు, వ్యాధి తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స పద్ధతులపై అవగాహన కల్పించారు. మలేరియాతో బాధపడుతున్న వారికి ధైర్యం చెప్పారు. అంగర పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ×దోమ పుట్టకూడదు – కుట్టకూడదు÷ నినాదంతో ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండపేట సబ్ యూనిట్ ఆఫీసర్ పీడీడీ బిషప్, రావులపాలెం సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, అంగర పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి రామారావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నానిబాబు, ఆరోగ్య కార్యకర్తలు వెన్నేటి వెంకటేశ్వరరావు, శ్రీనివాసు, శిరోమణి, సుశీలా దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కోలంకలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ అశోక్ తదితరులు

కాజులూరు: వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ మేలైన దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం కోలంకలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఏఓ పాల్గొని క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మానవవనరుల కొరత కారణంగా వ్యవసాయ రంగంలోనూ యంత్రపరికరాల అవసరం పెరిగిందన్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వ్యవసాయ డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత సాగు పరిస్థితులపైన రైతులకు పలు సలహాలు అందించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాసవర్మ, రైతులు దంతులూరి నరసింహరాజు, తిరువూరి బుల్లిరాజు, నామా రామకృష్ణ, నామా వెంకటసత్యనారాయణ పలువురు రైతులు పాల్గొన్నారు.

తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటకు చెందిన తోట శ్రీనివాసు తన తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస్ తండ్రి వెంకట్రావు ఈ నెల 7న తాడేపల్లిగూడెం వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లారన్నారు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని, రెండు రోజుల తరువాత తిరుపతిలో కనిపించినట్లు తెలిసిన వారు ఫోన్‌లో చెప్పారని అయితే తమ తండ్రి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం రాలేదని, ఆయన ఇంటికి తిరిగి రాలేదని కుమారుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అత్త, చిన్నత్త దాడి చేశారంటూ..

రామచంద్రపురం రూరల్: తనపై తన అత్త, చిన్నత్తలు కలసి వచ్చి పుట్టింట్లో ఉండగా దాడి చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వెలంపాలెంకు చెందిన మందపల్లి చంద్రశీలకు ఏడాది క్రితం తాళ్లరేవు మండలం జార్జిపేటకు చెందిన నానితో వివాహం జరిగింది. కొంతకాలంగా ఆమె అత్తగారు భర్తకు తనపై లేనిపోని మాటలు చెప్పి ఇద్దరి మధ్య తగాదాలు పెట్టి గొడవలు సృష్టించేది. ఈ నేపథ్యంలో చంద్రశీల ఆమె పుట్టిల్లు వెలంపాలేనికి వచ్చేసింది. అమ్మగారి ఇంటి వద్ద ఉన్న చంద్రశీలపై అత్త జ్యోతి, చిన్నత్త సుశీల వచ్చి దాడి చేశారు. దీంతో చంద్రశీల రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భుజంగరావు తెలిపారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

కె.గంగవరం: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి అన్నారు. మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు మహిళా హక్కులు, చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, చట్టాలపై అవగాహన లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలని తెలుసుకుని తమ రక్షణ కోసం వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. డ్రగ్స్ వినియోగం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం శక్తి యాప్, మహిళా చట్టాలపై విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఎస్సై జానీబాషా, పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన సదస్సు



మండపేట శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న వెంకన్నబాబు

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, ఆ దిశగా నియమ నిబంధనలపై బీఎల్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన ఉండాలని మండపేట అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి అన్నారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పట్టణ పరిధిలో ఉన్న 64 నుంచి 109 వరకూ గల పోలింగ్ బూత్‌ల పరిధిలోని బీఎల్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఒక రోజు శిక్షణ తరగతిని నిర్వహించారు. ఇటీవల న్యూఢిల్లీలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్, ఏడిద సచివాలయం వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ నాగం నాగశివ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, ఎన్నికల డీటీ పీఏ మెహర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత రాకుండా చర్యలు



రామచంద్రపురంలో ఎరువుల షాపులో నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్/కె.గంగవరం: రైతులకు అవసరమైన ఎరువులు కృత్రిమ కొరత రాకుండా తీసుకునే చర్యల్లో భాగంగా రాష్ట్ర స్థాయి స్క్వాడ్ అధికారులు నరసన్నపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎల్వీ మధు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ డీవీవీ సతీష్‌కుమార్‌లు మంగళవారం రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో ఎరువుల షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కృత్రిమ కొరత సృష్టించడం, ధరలు పెంచడం వంటి చర్యలకు పాల్పడకూడదని ఎరువుల డీలర్లను ఆదేశించారు. ఎరువులు అందించేటప్పుడు రైతుల వేలిముద్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో రామచంద్రపురం ఇన్‌చార్జి ఏడీఏ టీవీఆర్ మణిదీప్, కె.గంగవరం ఏఓ సద్గురుమూర్తి, ఏఈఓ ప్రేమ్‌కుమార్, హేమంత్‌లు పాల్గొన్నారు.

ఎరువుల షాపులో తనిఖీ

కపిలేశ్వరపురం (మండపేట): ఇప్పనపాడులోని శ్రీకృష్ణ జనరల్ స్టోర్ హోల్‌సేల్ ఎరువుల షాపును వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేసిన తనిఖీ బృందం తనిఖీ చేసింది. షాపులోని సరుకు లభ్యత, రికార్డులు, తదితర అంశాలపై మంగళవారం తనిఖీ బృందం ఆరా తీసింది. శ్రీకాకుళం ఏడీఏ ఎల్వీ మధు, విజిలెన్స్ సీఐడీ వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం తనిఖీ నిర్వహించింది. అనంతరం తనిఖీ అధికారులు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సక్రమంగా సకాలంలో అందుతున్నాయా లేదా అన్న అంశంపై తనిఖీలు చేస్తున్నామన్నారు. హోల్‌సేల్ డీలర్లు తమ స్వాధీనంలోని ఎరువులను జిల్లా పరిధిలోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఆలమూరు సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏ కేవీఎస్ రమేష్, మండపేట మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్, విస్తరణ అధికారి బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లూరులో 17న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు మంగళవారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాను నిలిపివేయనున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని రత్నాలరావు కోరారు.

సూర్యఘర్ పథకంతో విద్యుత్ ఆదా



మండపేటలో సోలార్ విద్యుత్‌పై మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

కపిలేశ్వరపురం (మండపేట): పీఎం సూర్యఘర్ పథకం ద్వారా అందించనున్న సోలార్ విద్యుత్ వినియోగంపై పట్టణ నివాసితులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఉద్యోగులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ అధికారుల సమక్షంలో పథకం ప్రయోజనాలను మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు వివరించారు.

ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రి బహూకరణ

కపిలేశ్వరపురం (మండపేట): వెలగతోడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు సర్పంచ్ నలమామిడి కృపరాజు క్రీడా సామగ్రిని సమకూర్చారు. త్రోబాల్స్, వాలీబాల్, ఇతర క్రీడా సామగ్రిని పాఠశాల నిర్వాహకులకు మంగళవారం ఆయన అందజేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్లు అందజేశారు. సర్పంచ్ కృపరాజును పాఠశాల హెచ్‌ఎం యేసు రాజు, వ్యాయామోపాధ్యాయులు పీడీ సహదేవుడు, ఉపాధ్యాయులు సత్కరించారు.